సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 28 । డిసెంబర్ । 2023



రమణీయం.. రథోత్సవం

శ్రీఅవధూత కాశినాయన 28వ ఆరాధన మహోత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. పెద్ద సంఖ్యలో భక్తులు కాశినాయన సమాధిని దర్శించుకున్నారు.

-8లో



కరోనా కలవరం

కరోనా మహమ్మారి తన ఉనికిని మళ్లీ చాటుకుంటోంది. ఇతర రాష్ట్రాల్లో ఈ కేసులు వెలుగు చూస్తున్న నేపథ్యంలో డీఎంహెచ్ఓ సూచనలతో ప్రత్యేక కథనం.

-8లో



వాతావరణం

జిల్లాలో బుధవారం 29.9 - 18.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు గురువారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4.00 నుంచి 5.00 గంటల వరకు ప్రయాణికులు తమ సమస్యలను 99592 25774 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

నూతన నియామకం



చరణ్‌కుమార్‌రెడ్డి

బద్వేలు అర్బన్: రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ(ఆర్‌సీడీఎస్) రాష్ట్ర యూత్ వింగ్ అధ్యక్షుడుగా బద్వేలు మండలం కొంగలవీడు గ్రామానికి చెందిన కాకర్ల చరణ్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.సురేంద్రరెడ్డి నుంచి బుధవారం నియామకపత్రం అందింది.

నేడు ఉర్దూ సంచార రథం రాక

కడప ఎడ్యుకేషన్: న్యూఢిల్లీ నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఉర్దూ లాంగ్వేజ్ వారి ప్రచార, సంచార గ్రంథాలయ రథం 28వ తేదీ గురువారం కడపకు రానున్నదని రాయలసీమ ఉర్దూ రచయితల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సత్తార్ ఫైజీ, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇలియాస్ బాషలు తెలిపారు. 28వ తేదీ గురువారం యోగివేమన విశ్వ విద్యాలయంలో, 29వ తేదీ శుక్రవారం కడప మున్సిపల్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ వాహనం ఉంటుందన్నారు. ఉర్దూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సాహితీ అభిమానులు సందర్శించి ఉర్దూ చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, పరిశోధన పుస్తకాల పరిశీలించాలన్నారు.

రామాలయానికి రూ.5లక్షలు



ఆలయ పెద్దలకు రూ.5లక్షలు ఇస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు సతీమణి రమాదేవి

ప్రొద్దుటూరు: మండలంలోని బొజ్జవారిపల్లె శ్రీరామాలయం వద్ద ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సతీమణి, 26వ వార్డు కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి రూ.5లక్షల విరాళాన్ని బుధవారం ఆలయ పెద్దలకు అందించారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే ఈ డబ్బు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, సోములవారిపల్లె పంచాయతీ సర్పంచ్ మోపూరి ప్రశాంతి, జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు కొండా ధనలక్ష్మి, ఉప్పరపల్లె సర్పంచ్ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మళ్ల పద్మ, ఎంపీటీసీ మాధవి పాల్గొన్నారు.

'ఓపెన్ స్కూల్' ఫీజులు చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్) నిర్వహించే పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజును జనవరి 19వ తేదీలోపు చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎద్దుల రాఘవరెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డిలు మంగళవారం తెలిపారు. మార్చి 18 నుంచి 27వ తేదీ వరకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్ర 5.30 గంటల వరకు పరీక్షలుంటాయన్నారు. వీటి ఫీజును జనవరి 19వ తేదీ లోపు చెల్లించాలన్నారు. అలాగే రూ.25 అపరాధ రుసుముతో జనవరి 20 నుంచి 27వ తేదీ వరకు, రూ.50 అపరాధ రుసుముతో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. తత్కాల్ రుసుముతో పదో తరగతికి రూ.500, ఇంటర్‌కు రూ.1000తో పాటు ఆయా సబ్జెక్టులకు నిర్దేశిత పరీక్ష ఫీజును ఏపీ ఆన్‌లైన్, ఏపీఓఎస్ఎస్ ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలని వారు సూచించారు.

నిబంధనల మేరకు విధులు



మాట్లాడుతున్న వెంకట రమణారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని గ్రామీణ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి వెంకట రమణారెడ్డి సూచించారు. కడప నగరంలోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో సచివాలయ ఉద్యోగుల మూడో బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ శిక్షణ కాలంలో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. జిల్లా గ్రామ, వార్డు సచివాలయ కార్యాలయ పరిపాలన అధికారి రామకృష్ణయ్య మాట్లాడుతూ సమస్యలను సహృదయంతో అర్థం చేసుకుని పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ ,రీజనల్ కో–ఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

సృజన వీచిక.. విజ్ఞాన వేదిక




నిర్వహణ కమిటీ సభ్యులకు సూచనలు ఇస్తున్న డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి



ప్రాజెక్టుల ప్రదర్శనకు గదుల్లో నంబరింగ్ ఇస్తున్న నిర్వహణ కమిటీ సభ్యులు

- రాష్ట్రస్థాయి సైన్సుఫేర్‌కు ఏర్పాట్లు పూర్తి
- నేడు, రేపు కడప సెయింట్ జోసెఫ్ కళాశాలలో నిర్వహణ
- రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి రానున్న ప్రాజెక్టులు
- ప్రారంభ సభకు హాజరుకానున్న డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేలు

కడప ఎడ్యుకేషన్: కడప మరియపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో ఈ నెల 28,29 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సైన్సుఫేర్‌కు సర్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశారు. ఈ రాష్ట్రస్థాయి సైన్సుఫేర్‌కు 26 జిల్లాల నుంచి 234 ప్రాజెక్టులు రానున్నాయి. ఇందులో వ్యక్తిగత విభాగం కింద 78 ప్రాజెక్టులు, గ్రూపు విభాగం కింద 78 ప్రాజెక్టులు, టీచర్ విభాగం కింద 78 ప్రాజెక్టులు ప్రదర్శనకు రానున్నాయి. విద్యార్థులు తమ సృజనాత్మకతను రంగరించి సిద్ధం చేసుకుని వచ్చిన ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు వీలుగా మరియాపురం జూనియర్ కళాశాలలో తరగతుల వారీగా టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రాజెక్టుల ప్రదర్శనకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సర్వం సిద్ధం చేశారు. ఇతర జిల్లాల నుంచి రానున్న విద్యార్థులు, గైడ్ టీచర్లు బస చేసేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



ప్రాజెక్టులను వీక్షించేందుకు వీలుగా...

రాష్ట్రస్థాయి సైన్సుఫేర్‌లో విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించిన వాటి గురించి వాటి పనితీరు గురించి పిల్లలకు వివరించనున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను ఎంపిక చేసిన 15 మంది జ్యూరీ సభ్యులు పరిశీలించి ఆ ప్రాజెక్టులను మూల్యాంకనం చేసి సమాజానికి మంచి సందేశం ఇచ్చే 35 రకాల ప్రాజెక్టులను రీజనల్ స్థాయికి ఎంపిక చేయనున్నారు. ఇందులో వ్యక్తిగత విభాగం నుంచి 15 ప్రాజెక్టులు, గ్రూపు విభాగం నుంచి 10 ప్రాజెక్టులు, టీచర్ విభాగం నుంచి 10 ప్రాజెక్టులను రీజనల్ స్థాయికి ఎంపిక చేస్తారు. ఈ రీజనల్‌స్థాయి పోటీలను విజయవాడలో జనవరి నెలలో నిర్వహించనున్నారు.

కార్యమానికి హాజరుకానున్న డిప్యూటీ సీఎం

రాష్ట్రస్థాయి సైన్సుఫేర్ ప్రారంభ కార్యక్రమానికి కళాశాల ఆవరణలో వేదికను సిద్ధం చేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషాతో పాటు జిల్లాకు సంబంధించిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్ విజయరామరాజు హాజరుకానున్నారు. దీంతోపాటు కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి అధికారులు, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండపల్లె ప్రతాప్‌రెడ్డి హాజరుకానున్నారు. సమావేశానంతరం విద్యార్థులు తమ తమ ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు.

అన్ని జిల్లాల నుంచి..



రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి 234 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి సైన్సుఫేర్‌కు వస్తున్నాయి. విద్యార్థులు తమ తమ ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అలాగే పిల్లలకు ప్రదర్శించిన ప్రాజెక్టులు వీక్షించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేశాం. - మహేశ్వర్ రెడ్డి, జిల్లా సైన్సు అధికారి

ఏర్పాట్లు పూర్తి



రాష్ట్రస్థాయి సైన్సుఫేర్ కార్యక్రమానికి కమిటీలను ఏర్పాటు చేశాం. ఆ కమిటీ సభ్యులందరూ తమకు అప్పగించిన కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ప్రాజెక్టుల ప్రదర్శన కోసం అన్ని తరగతి గదులలో టేబుళ్లను కూడా ఏర్పాటు చేశాం. అలాగే ఇతర జిల్లాల నుంచి వచ్చే విద్యార్థులు, గైడ్ టీచర్స్ బస చేసేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశాం. - ఎద్దుల రాఘవరెడ్డి, డీఈఓ

అన్నీ సజావుగా జరిగేలా...



రాష్ట్రస్థాయి సైన్సుఫేర్‌లో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సజావుగా జరిగేలా సూచనలు ఇచ్చాం. ఈ మేరకు ఎంఈఓలు, డిప్యూటీ ఈఓ, డీఈఓతోపాటు సైన్సుఫేర్ నిర్వహణకు కమిటీలు ఏర్పాటు చేశాం. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలను చేపట్టాం. - మార్తాల వెంకటకృష్ణారెడ్డి, పాఠశాల విద్య ఆర్‌జేడీ

టిష్యూకల్చర్ ల్యాబ్ ప్రారంభం

రైల్వేకోడూరు: మండలంలోని అనంతరాజుపేట వైఎస్సార్ హార్టికల్చర్ పరిశోధనా కేంద్రంలో బుధవారం టిష్యూ కల్చర్ ల్యాబ్‌ను వైస్ చాన్స్‌లర్ జానకిరామ్, డైరెక్టర్ ఆఫ్ రీసర్చ్ డాక్టర్ నారం నాయుడు , రిజిస్టర్ బి.శ్రీనివాసులు, డాక్టర్ కరుణశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేకోడూరు ప్రాంతంలో అత్యధికంగా అరటిని సాగుచేస్తున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్‌కేవీ నిధులు కోటిన్నర రుపాయలతో టిష్యూకల్చర్ ల్యాబ్‌ను ప్రారంబించామన్నారు. ఏడాదికి లక్షకు పైగా అరటి మొక్కలు ఉత్పత్తి చేసేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. అలాగేఎస్టీ, ఎస్సీ సబ్‌ప్లాన్ లో పుట్ట గొడుగుల పెంపకం, ఇన్‌పుట్స్‌పైన రైతులకు వివరించారు. అరటి ఉత్పత్తి దిగుబడిని పెంపొందించే లక్ష్యంతో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అసోసియేట్ డీన్ గోపాల్, ప్రొఫెసర్ సిహెచ్.రూత్, తదితరులు పాల్గొన్నారు.

పసుపులేటి శంకర్‌కు డాక్టరేట్



నందలూరు(రాజంపేట): ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పసుపులేటి శంకర్‌కు ఆసియా అంతర్జాతీయ సాంస్కృతిక పరిశోధన విశ్వవిద్యాలయం ఆధ్యాత్మికం, దైవత్వం రంగంలో చేసిన కృషికి గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. ప్రస్తుతం శంకర్ రాజంపేట కోర్టులో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్నారు. ఆధ్యాత్మిక రంగంలో ఆయన చేసిన సేవలకు ప్రతిగా డాక్టరేట్ రావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

అమరలింగేశ్వరుడికి పూజలు

సిద్దవటం: మండలంలోని మాధవరం–1 గ్రామంలో వెలసిన శ్రీమంగళ గౌరీ సమేత అమరలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజాము నుంచే మహాన్యాస రుద్రాభిషేకం జరిపారు. ఈ సందర్భంగా పండితులు మాట్లాడుతూ మార్గశిర మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రం రోజున శివునికి మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహిస్తే మంచిదన్నారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన సేవలు

కలెక్టర్ విజయరామరాజు

చాపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామాల్లోనే మెరుగైన సేవలు అందుతున్నాయని జిల్లా కలెక్టర్ విజయరామరాజు అన్నారు. మండలంలోని మడూరు గ్రామంలో రూ.4కోట్లతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాలను బుధవారం మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డితో కలసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సేవల కోసం గతంలో ప్రజలు మండల కేంద్రాలకు వెళుతూ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉండేవని.. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని రకాలైన ప్రభుత్వ సేవలతో పాటు వైద్య సేవలు కూడా ఇక్కడే అందుతాయన్నారు. మడూరు గ్రామంలో జగనన్న కాలనీ అందంగా ఉందని, ఈ గ్రామ ప్రజలకు ప్రభుత్వం రూ.18.9కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందాయన్నారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

సీఎం ప్రజల పక్షపాతి: ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

సీఎం వైఎస్ వైఎస్ జగన్ పేద ప్రజల పక్షపాతి అని, ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చేందుకు అనేక సంక్షేమ పథకాలు పెట్టారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తే పథకాలు వచ్చేవని అన్నారు.అందరి సంక్షేమం కృషి చేసే సీఎం వైఎస్ జగన్‌మోహరెడ్డి ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. మడూరు గ్రామంలో నూతనంగా నిర్మితమైన జగనన్న కాలనీలోని ఇళ్లను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇదే క్రమంలో పేద ప్రజలకు మంజూరైన వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులు, అర్హత కలిగిన మహిళలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీఓ శ్రీనివాసులు, ఎంపీపీ లక్షుమయ్య, స్థానిక నాయకుడు వినయ్‌కుమార్‌రెడ్డి, పీఆర్ ఈఈ రామచంద్రారెడ్డి, డీఈ మల్లేశ్వర్‌రెడ్డి, ఏఈ ఈశ్వరయ్య, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, వైద్యాధికారి రాజేష్‌కుమార్, ఆప్తాలమిక్ తేజ, ఏఓ మ్యాగీ, ఈఓ పీఆర్డీ రాధాకృష్ణవేణి, కార్యదర్శి భాగ్యలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామోహన్‌రెడ్డి, ముస్లీం యువ నాయకులు మన్సూర్, మాజీ జెడ్పీటీసీ బాలనరసింహారెడ్డి, పీపీ రమణారెడ్డి, మాజీ సింగిల్ విండో వేమారెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కడప సెవెన్‌రోడ్స్: పేదల ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి పాటుపడుతోందని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెల జరిగే మొదటి స్పందన కార్యక్రమంలో మొదటి గంటలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తామన్నారు. ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన కేసుల్లో బాధితులకు న్యాయంతో పాటు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే పొక్సో చట్టం, బాల్య వివాహాలు నిరోధక చట్టం పైన ప్రజల్లో అవగాహన సదస్సులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే.. విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకట కిషోర్ మాట్లాడుతూ.. దళితులకు సంబంధించిన పలు రకాల భూ సమస్యలు ఉన్నాయని.. వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్.డి.ఓలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకట రమణ, వెంకటేశ్వర్లు, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డా.వెంకట సుబ్బయ్య, జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన పెంపొందించాలి

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం క్రింద జిల్లాలో ఈ నెల 27 నుంచి జనవరి 12 వరకు చేపడుతున్న కుష్టు వ్యాధి నిర్ధారణ అవగాహన కార్యక్రమాన్ని బాధ్యతగా చేపట్టాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. వైద్య శాఖ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గృహ సందర్శన చేసి కుష్టు వ్యాధి లక్షణాలపై స్వీయ పరీక్ష చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

బడుగులకు సాధికారం

- రాజ్యాధికారంలో భాగస్వామ్యం.. సంక్షేమంలో అగ్రపీఠం
- వైఎస్ జగన్ సర్కార్‌లో బడుగు, బలహీన వర్గాల ఉన్నతికి పెద్దపీట
- ఆచరణలో సామాజిక న్యాయం చూపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- నేడు రాయచోటిలో సామాజిక సాధికార బస్సు యాత్ర


సాక్షి రాయచోటి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అట్టడుగు వర్గాలకు అగ్రపీఠం దక్కింది. అగ్రవర్ణాలతో సమానంగా బలహీన వర్గాలు కూడా రాణించాలన్న సమున్నత సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి పెద్దపీట వేశారు. సమాజంలో అందరికంటే ఎక్కువగా సంక్షేమంతోపాటు సామాజిక న్యాయం జరగాలని సంకల్పించారు. ఓ వైపు సంక్షేమాన్ని అందిస్తూనే...మరోవైపు రాజ్యాధికారంలో వారికి భాగస్వామ్యం కల్పించి బడుగు, బలహీన వర్గాల గుండెల్లో వైఎస్ జగన్ చిరస్మరణీయమైన ముద్ర వేసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు దశాబ్దాల చరిత్రలో ఏ ప్రభుత్వం చేయనంత మంచి ప్రయోజనాన్ని వారికి అందించారు.

నాడు..నేడు ఎంతో తేడా

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో బడుగు బలహీన వర్గాలకు అగ్ర తాంబూలం అందించారు. ఇదివరకు ఆయా పార్టీలు, నేతలు మాటలకే పరిమితం చేస్తే వైఎస్ జగన్ చేతల్లో చూపించారు. రాజ్యాధికారంలో వారే కీలకమంటూ అన్ని విధాలుగా వారిని అందలం ఎక్కించారు. రాజకీయ పదవులతోపాటు ఇతర నామినేటెడ్, కార్పొరేషన్ పదవులు, సంక్షేమ పథకాలు ఇలా చెబుతూ పోతే ప్రత్యేకంగా అణగారిన వర్గాలకు పెద్దపీట వేస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత సేపు వెనుకబడిన వర్గాల ఓట్ల కోసం ఆసక్తి చూపించిందే తప్ప పూర్తి స్థాయిలో వారి ఆర్థిక భద్రతకు చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. అందుకే ఎక్కడ చూసినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వైఎస్సార్ సీపీకి బ్రహ్మరథం పడుతున్నారు.

నేడు సామాజిక సాధికారిక బస్సు యాత్ర

అన్నమయ్య జిల్లా రాయచోటిలో గురువారం మధ్యాహ్నం సామాజిక సాధికార బస్సు యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి నేతృత్వంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులతోపాటు ఇతర రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు రింగ్‌రోడ్డు నుంచి ర్యాలీ ప్రారంభమై బంగ్లా వరకు కొనసాగనుంది. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రజా ప్రతినిధులు, నేతలు మాట్లాడనున్నారు. అందుకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.



రాయచోటి నియోజకవర్గానికి రూ.1289 కోట్ల ప్రయోజనం



అన్నమయ్య జిల్లాకు సంబంధించి రాయచోటి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పరంగా ప్రభుత్వం భారీగా నిధులను ఖర్చుచేసింది. ఒక్క రాయచోటి నియోజకవర్గానికే డీబీటీ ద్వారా రూ. 934 కోట్లు, నాన్ డీబీటీ కింద రూ. 355 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో బీసీలకు డీబీటీ కింద రూ. 695 కోట్లు, నాన్ డీబీటీ కింద రూ. 272 కోట్లు కలిపి మొత్తం రూ. 967 కోట్లు అందింది. అలాగే ఎస్సీలకు డీబీటీ ద్వారా రూ. 140 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 45 కోట్లు కలిపి మొత్తం రూ. 185 కోట్ల మేర లబ్ధి చేకూరింది. అలాగే ఎస్టీలకు డీబీటీ ద్వారా రూ. 65 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 27 కోట్లు కలిపి రూ. 92 కోట్ల ప్రయోజనాన్ని అందించారు. అలాగే మైనార్టీలకు సంబంధించి డీబీటీ ద్వారా రూ. 65 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 27 కోట్లు కలిపి రూ. 92 కోట్ల లబ్ధిని ప్రభుత్వం చేకూర్చింది.

రాజకీయ పదవుల్లోనూ పెద్దపీట

రాయచోటి పట్టణం మైనార్టీ వర్గానికి చెందిన జకియాఖానమ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతోపాటు శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్‌గా నియమించారు. అలాగే రాయచోటి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులనుకూడా ముస్లిం మైనార్టీలకు కేటాయించారు. అంతేకాకుండా ఆస్పత్రి అభివృద్ధి కమిటీతోపాటు మార్కెట్‌యార్డు చైర్మన్ పదవిని బీసీలకు కట్టబెట్టారు. లక్కిరెడ్డిపల్లె, గాలివీడు,రామాపురం, చిన్నమండెం మండలాల్లోని పలువురు ప్రజాప్రతినిధులకు మండల స్థాయి పదవులతోపాటు కార్పొరేషన్లకు సంబంధించి రాష్ట్ర డైరెక్టర్ల పదవులను కూడా ఆయా వర్గాలకు ప్రాధాన్యతను ప్రభుత్వం కల్పించింది.

జయప్రదం చేయాలి

వైఎస్ఆర్‌సీపీ సామాజిక సాధికారిక బస్ యాత్రలో బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేబినెట్‌లో బీసీ, ఎస్సీ, మైనార్టీలకు పెద్దపీట వేశామన్నారు. రాజ్యాంగ పదవులైన ఎమ్మెల్సీలలో, కార్పొరేషన్లలో, మేయర్ల స్థానంలో, మునిసిపల్ ఛైర్మన్‌ల స్థానంలో అందరికీ సామాజిక న్యాయం చేశామని గుర్తు చేశారు. జగన్ చేస్తున్న మంచికి ప్రచారం రాకూడదని స్వార్థ రాజకీయాల కోసం ఎజెండాలు పట్టుకొని అనునిత్యం జగన్‌పై బురదజల్లేందుకు దుష్టశక్తులు కుట్ర పన్నుతున్నాయన్నారు. దుష్ట శక్తుల్ని తరిమికొట్టడానికి రాయచోటిలో సామాజిక సాధికార బస్సుయాత్ర జరగనుందన్నారు.

యాత్రకు సర్వం సిద్ధం

రాయచోటి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తోన్న మేలును వివరించడానికి వైఎస్ఆర్ సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్రకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి నియోజకవర్గ పరిధిలో జరగనుంది. ఈ బస్‌యాత్రలో అంజద్‌బాషా, అనిల్‌యాదవ్, విడదల రజని, మేరుగ నాగార్జున, నందిగాం సురేష్ తదితర నేతలు పాల్గొననున్నారు.

షెడ్యూల్ ఇలా..

- మధ్యాహ్నం 11.30కు రాయచోటి పట్టణంలోని అభి కళ్యాణ మండపంలో ప్రెస్‌మీట్
- మధ్యాహ్నం 1.00కు అభి కళ్యాణ మండపం నుంచి చెక్‌పోస్ట్ శివాలయం వరకు బస్‌యాత్రకు సంఘీభావంగా బైక్ ర్యాలీ
- మధ్యాహ్నం 1.30కు శివాలయం నుంచి బంగ్లా వరకు బస్‌యాత్రకు సంఘీభావ పాదయాత్ర
- మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బంగ్లా సర్కిల్(నేతాజీ సర్కిల్)లో భారీ బహిరంగసభ

వారం రోజులుగా చైతన్య యాత్రలు..

సామాజిక సాధికారిక బస్‌యాత్ర విజయవంతానికి వారం రోజులుగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మండలాల వారీగా కార్యకర్తలు, నాయకులతో ఆత్మీ య సమావేశాలు నిర్వహించి చైతన్యం చేశారు. ఈ సమావేశాలు విజయవంతంగా జరిగాయి. బస్‌యాత్రను జయప్రదం చేసేందుకు బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలవారు ఉత్సాహంగా ఉన్నారు.

ప్రత్యేక శోభను సంతరించుకున్న రాయచోటి

బస్ యాత్ర సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారులలో స్వాగత ఫ్లెక్సీల ఏర్పాటుతో నూతన శోభ సంతరించుకుంది. బస్ యాత్రకు రానున్న ప్రజలందరికీ భోజనం, తాగునీరు వసతులను ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు.

క్లుప్తంగా

మోటార్ బైక్‌లు ఢీ

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలోని పాపాఘ్ని నదిపై ఉన్న అప్రోచ్ రోడ్డుపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడాదిన్నర వయస్సున్న చిన్నారి ఆరాధ్య తలకు తీవ్ర గాయాలయ్యాయని కమలాపురం 108 టెక్నీషియన్ కొండయ్య తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దచెప్పలికి చెందిన గౌరీ శంకర్ తన భార్య, ఇద్దరు పిల్లలతో తన మోటార్ బైక్‌లో కట్ట గ్రామంలోని అత్తారింటికి వెళ్తుండగా మార్గ మధ్యలో అప్రోచ్ రోడ్డు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న మరో బైక్ వేగంగా వచ్చి ఢీ కొంది. ఈ ఘటనలో చిన్నారి ఆరాధ్య తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం చిన్నారిని రిమ్స్‌కు తరలించారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

మైదుకూరు : మైదుకూరులో రెండు రోజుల క్రితం ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బుధవారం మైదుకూరు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బద్వేలు విద్యానగర్‌కు చెందిన కావడి శ్రీనుకు ప్రొద్దుటూరుకు చెందిన శ్రీదేవికి పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. మనస్పర్థలు రావడంతో భార్యాభర్తలు ఏడేళ్ల క్రితం విడిపోయారు. డోజర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీను సోమవారం మైదుకూరు పట్టణంలోని నంద్యాల రోడ్డులో ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఇతనిని చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర తెలిపారు. ఒంటరితనం భరించలేక శ్రీను ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు ఆయన పేర్కొన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం



దగ్ధమైన సామగ్రి

కొండాపురం : మండల పరిధిలోని ఎస్. తిమ్మాపురం గ్రామానికి చెందిన బుడ్డా శ్రీనివాసులు ఇంటిలో బుధవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇంటిలోని సామగ్రి దగ్ధమైంది. ఈ ఘటనలో సుమారు రూ. 6 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపాడు. తాడిపత్రి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను అదుపు చేశారు.

కరోనా కలవరం

కరోనా మహమ్మారి తన ఉనికిని మళ్లీ చాటుకుంటోంది. మొదటి నుంచీ ఎండా కాలం వచ్చే ముందే కోవిడ్ రావడం పరిపాటిగా మారింది. ఇతర రాష్ట్రాల్లో ఈ కేసులు వెలుగు చూస్తున్నాయి. మన రాష్ట్రంలో విశాఖపట్నం, ఏలూరు ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ఇప్పటి వరకు ఎలాంటి కేసులు నమోదు కానప్పటికీ ముందస్తు జాగ్రత్తలకు సిద్ధమైంది.

- మళ్లీ వెలుగు చూస్తున్న కేసులు
- జాగ్రత్తలతోనే కోవిడ్ కట్టడి
- అప్రమత్తమైన ఆరోగ్య శాఖ

కడప రూరల్ : అది 2019వ సంవత్సరం. చైనాలో కోవిడ్ కేసులు వెలుగు చూశాయి. తరువాత ఈ వైరస్ దెబ్బకు ప్రపంచమే వణికిపోయింది. జిల్లా విషయానికి వస్తే 2020 మార్చి 31వ తేదీన మొదటి పాజిటివ్ కేసు నమోదైంది. తరువాత రెండవ ఏడాది కూడా కేసులు నమోదయ్యాయి. మొదటి సారి కంటే రెండవ సారి తక్కువ కేసులు నమోదైనప్పటికీ మరణాల సంఖ్య పెరిగింది. మూడవ ఏడాది కోవిడ్ ఒమిక్రాన్ రూపంలో వచ్చింది. ఈ వైరస్ ప్రజలపై ఏమాత్రం ప్రభావం చూపలేదు. తాజాగా మళ్లీ కరోనా పలకరిస్తోంది...నేనెక్కడికీ వెళ్లలేదు అజాగ్రతగా ఉంటే వస్తానంటూ హెచ్చరిస్తోంది.. ఇతర దేశాల్లో ఈ కేసులు నమోదవుతున్నాయి. మన దేశంలో కేరళ రాష్ట్రంలో అధిక సంఖ్యలో పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అక్కడి నుంచి రాకపోకలు సాగించడంతోనే ఇతర రాష్ట్రాల్లో కేసులు పుట్టుకొస్తున్నాయని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. తాజాగా ఈ వైరస్ జేఎన్–1తో పాటు ఇతర రూపాలను సంతరించుకొని ఉంది. జాగ్రత్తగా ఉండకపోతే పాని పడతానంటూ కరోనా హెచ్చరిస్తోంది.

తాజా పరిణామాలతో అప్రమత్తం

ప్రభుత్వ సూచనలతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ విభాగాలు అప్రమత్తం అయ్యాయి. కోరానా సమయంలో కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఉన్న వీఆర్‌డీఎల్ (వైరల్ రీసెర్చ్ డయాగ్నోస్టిక్ ల్యాబొరేటరి) సమర్థవంతంగా పని చేసింది. తాజా పరిణామాలతో ఈ ల్యాబ్‌ను సిద్ధం చేయాలని అధికారులు ఆదేశించారు. అలాగే కోవిడ్ లక్షణాలు గల వారికి నిర్ధారణ పరీక్షలు చేయడానికి వీటీఎం (వైరల్ ట్రాన్స్‌పోర్ట్ మీడియం) కిట్స్ రానున్నాయి. ఇలా ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా ఆరోగ్య శాఖలకు చెందిన అధికారులు సిద్ధమవుతున్నారు.

పటిష్టవంతమైన యంత్రాంగం

ఏ ఆపద సమయాలను ఎదుర్కోవడానికైనా సరే ప్రభుత్వం పటిష్టవంతమైన యంత్రాంగాన్ని ప్రారంభం నుంచే సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా కడప ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రితో పాటు పలు ప్రధాన ఆసుపత్రులు వాటికి తోడు 51 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వాటి పరిధిలో 340 డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, పట్టణ ప్రాంతాల్లో 30 డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పనిచేస్తున్నాయి. దాదాపుగా అన్ని వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు లభిస్తున్నాయి. ఇంతటి పటిష్టవంతమైన ఆరోగ్య యంత్రాంగం దేశంలోనే ఎక్కడా లేదని ఘంటా పథంగా చెప్పవచ్చు. దీంతో ఎలాంటి పరిస్థితినైనా ఆదిలోనే అడ్డుకట్ట వేయడానికి ఆస్కారం ఏర్పడింది. దేశంలోనే రాష్ట్ర ప్రభుత్వం కోవిడ్‌ను శరవేగంగా సమర్థవంతంగా ఎదుర్కొని కట్టడి చేయగలిగింది.

ముందస్తు జాగ్రత్తలు ఎంతైనా మంచిది



మెరుగైన ఆరోగ్యానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. అది కోవిడ్ అయినా మరేదైనా. సాధారణంగా మాస్క్‌ను ధరించడం, చేతులను పరిశుభ్రం చేసుకోవడం చాలా మంచిది. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించడం ఎంతో శ్రేయస్కరం. తాజాగా ఇతర ప్రాంతాల్లో కోవిడ్ కేసులు నమోదు కావడంతో ప్రభుత్వ సూచనలతో అప్రమత్తంగా ఉన్నాం. ఇది పండుగల సమయం. తప్పని సరిగా మాస్క్‌ను ధరించి ఇతర జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

కారు, బైకు ఢీ

ప్రొటెక్షన్ వాచర్ మృతి



గోపాల్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రామాపురం : రామాపురం – లక్కిరెడ్డిపల్లె రహదారిలోని సుద్దమళ్ల క్రాస్ రోడ్డు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రొటెక్షన్ వాచర్ గోపాల్(35) మృతి చెందాడు. ఎస్ఐ కొండారెడ్డి వివరాల మేరకు.. మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ బయారెడ్డిగారిపల్లె ఎగువ హరిజనవాడకు చెందిన గోపాల్ అటవీశాఖలో ప్రొటెక్షన్ వాచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రాయచోటి రేంజ్ కార్యాలయం పరిధిలోని నగరవనంలో విధులు ముగించుకొని బైకుపై ఇంటికి బయలుదేరాడు. సుద్దమళ్ల క్రాస్ రోడ్డు సమీపానికి రాగానే లక్కిరెడ్డిపల్లె వైపు నుంచి రామాపురం వైపు వెళ్తున్న ఏపీ37ఏడబ్ల్యు 4445 గల స్కార్పియో వాహనం బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో గోపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మండల పోలీసులు, ఫారెస్టు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన కమలకూరు చెన్నమ్మ


అట్లూరు : మండల పరిధిలోని కడప–బద్వేలు ప్రధాన రహదారిపై లింగాలకుంట ఎస్సీకాలనీ సమీపంలో గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొని కమలకూరు చెన్నమ్మ అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు సోమేశ్వరపురం గ్రామానికి చెందిన కమలకూరు చెన్నమ్మ సోమేశ్వరపురం, లింగాలకుంట గ్రామాలలో ప్రతి రోజూ ఉదయం ఇంటింటికీ వెళ్లి పాలు పోసేది. అందులో భాగంగా బుధవారం కూడా ఉదయం పాలు పోసేందుకు రోడ్డువెంట నడిచివెళుతుండగా బైకుపై ఇద్దరు వ్యక్తులు అతి వేగంగా బద్వేలు వైపు వెళుతూ ఆమెను ఢీకొన్నారు. ఆమె తలకు బలమైన గాయం కావడంతో స్పృహ కోల్పోయింది. ఆమెను ఢీకొన్న ద్విచక్రవాహనంలోని వారు కూడా కింద పడి స్థానికులు అక్కడికి చేరుకునే లోపు బైకు తీసుకుని పరారయ్యారు. గాయపడిన చెన్నమ్మను 108 వాహనం ద్వారా బద్వేలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రమణీయం.. రథోత్సవం

- ముగిసిన కాశినాయన ఆరాధన మహోత్సవాలు
- కాశినాయన జ్యోతిని చూసి తరించిన భక్తులు



కాశినాయన గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ఆకాశంలో కనిపిస్తున్న కాశినాయన జ్యోతి

కాశినాయన : శ్రీఅవధూత కాశినాయన 28వ ఆరాధన మహోత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. అధిక సంఖ్యలో భక్తులు ఆరాధన మహోత్సవాల్లో పాల్గొని కాశినాయన సమాధిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కాశినాయన సమాధిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాశినాయన రథోత్సవంలో పాల్గొన్నారు. మంగళవారం అర్ధరాత్రి 12–30 గంటలకు కాశినాయన జ్యోతిస్వరూపం దర్శనమిచ్చింది. ఆకాశంలో కాశినాయన జ్యోతిని చూసి భక్తులు పునీతులయ్యారు. అనంతరం కాశినాయన ఉత్సవ విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు ప్రమిదలతో దీపాలను వెలిగించుకుని గ్రామోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే కాశినాయన మాల ధరించిన భక్తులు దివిటీలు చేతబూని రథోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆరాధన మహోత్సవాలకు 140 క్వింటాళ్లకు పైగా బియ్యం ఖర్చు కాగా అంతకు రెట్టింపు బియ్యాన్ని భక్తులు సమర్పించారు. అధిక మొత్తంలో నగదును కూడా సమర్పించుకున్నారు. కాశినాయన గ్రామోత్సవం అనంతరం కాశినాయన విగ్రహానికి పవళింపు సేవ నిర్వహించారు. ఆరాధన మహోత్సవాలు వైభవంగా జరిగేందుకు ప్రజలందరూ సహకరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సజావుగా ఆరాధన ముగిసిందని ఆలయ కమిటీ తెలిపింది.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం ప్రకాశ్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం భారతి సిమెంట్ ఫ్యాక్టరీ వారి సౌజన్యంతో పుష్పగిరి ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దండే రవిప్రకాశ్ ప్రారంభించారు. డాక్టర్ వినోద్ కుమార్ సుమారు 253 మందికి పైగానే కంటి వైద్య పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలతో పాటు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే శస్త్రచికిత్స అవసరమైన వారికి సిఫార్సు చేశారు. దండే రవిప్రకాశ్ మాట్లాడుతు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ఎం సుధీర్‌రెడ్డి సహకారంతో భారతి సిమెంట్ ఫ్యాక్టరీ వారు పలుమార్లు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్‌వైజర్ అమరనాథ్‌రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వినోద్‌కుమార్

సారా విక్రేత అరెస్టు

నిమ్మనపల్లె : సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని కొండయ్యగారిపల్లె పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లె సమీపంలో అదే గ్రామానికి చెందిన వెంకటస్వామి సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో అరెస్టు చేశామన్నారు. నిందితుడి నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారన్నారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. జగనన్న సురక్ష ద్వారా పలు సర్టిఫికెట్లు సత్వరమే అందుతున్నాయి. నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి



మా ఊర్లోని ప్రభుత్వ పాఠశాల రూపురేఖలే మారిపోయాయి. మూడేళ్ల క్రితం వరకూ పాడుబడిన భవనాలు ఉండేవి. వర్షం పడిన ప్రతి సారి పాఠశాలకు టీచర్లు సెలవులు ఇచ్చేవారు. రెండేళ్లుగా ప్రైవేటు స్కూల్ కంటే మా ఊర్లోని స్కూల్ చాలా బాగుంది. మా కొడుకుని ఇక్కడే చదివిస్తున్నాను. పాఠశాల బాగుండటంతో పాటు మధ్యాహ్నం భోజనం కూడా చాలా బాగుంది.

-ఆలూరు హుస్సేన్‌బీ, అల్లాడుపల్లె గ్రామం, చాపాడు మండలం

రూపాయి ఖర్చు లేకుండా ధ్రువీకరణ పత్రాలు



రూపాయి ఖర్చు లేకుండా ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సచివాలయంలోనే ఇస్తున్నట్లు మా వలంటీర్ చెప్పడంతో దరఖాస్తు చేసుకున్నాను. దరఖాస్తు చేసుకున్న రెండు, మూడు రోజుల్లోనే ధ్రువీకరణ పత్రాలు వచ్చినట్లు వలంటీర్ ద్వారా తెలిసింది. స్థానిక సచివాలయానికి వెళ్లి ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకున్నాము. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి రోజుల తరబడి తిరిగితే గాని వచ్చేవి కావు. జగనన్న ప్రభుత్వంలో వలంటీర్ ద్వారా అన్ని పథకాలు ఇంటి వద్దకే వస్తున్నాయి. ధ్రువీకరణ పత్రాలు కూడా ఇంటి వద్దకే రావడంతో మేము ఎప్పుడూ సీఎంకు రుణపడి ఉంటాం.

– మున్నెల్లి లక్ష్మిదేవి, కాలువపల్లె, గోపవరం మండలం

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న దుంగలు, నిందితుడితో అటవీ అధికారులు

రామాపురం : పాలకొండలు ప్రాంతంలోని కోర్తిమడుగు బీటులో కోర్తిపెంట వద్ద అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు వంగిమళ్ల బీటు సెక్షన్ ఆఫీసర్ భరణి కుమార్ తెలిపారు. అలాగే ఒక కూలీని అరెస్టు చేశామన్నారు. ఆయన కథనం మేరకు.. తమకు ముందస్తు సమాచారం రావడంతో దాడి నిర్వహించి 260 కేజీల బరువు గల 9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైకు చెందిన కృష్ణమూర్తి అనే కూలీని అరెస్టు చేసి తిరుపతిలోని ఎర్రచందనం కోర్టులో హాజరు పరిచామన్నారు. ఎర్రచందనం దుంగల విలువ రూ.1,21,459 ఉంటుందన్నారు. దాడిలో బీట్ అధికారులు మహబూబ్‌బాషా, బేస్‌క్యాంప్ సిబ్బంది గుర్రయ్య, ఖాదర్‌వలీ, శీను, రెడ్డయ్య, రమణ, కేశవులు పాల్గొన్నారు.

విడాకులిచ్చిన భార్యపై దాడి

మదనపల్లె : విడాకులు తీసుకుందన్న కోపంతో భర్త భార్యపై దాడిచేసేందుకు వెళ్లిన ఘటనలో అడ్డువచ్చిన స్నేహితురాలు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని అప్పారావుతోటలో నివాసం ఉంటున్న ఎస్.ఫర్హానా(28) స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో హెడ్ నర్స్‌గా పనిచేస్తోంది. ఆమెకు భర్త ఇర్ఫాన్‌తో మనస్పర్థలు రావడంతో వారం క్రితం కోర్టు నుంచి విడాకులు పొందింది. దీంతో భార్యపై కోపం పెంచుకున్న భర్త తన స్నేహితుడు రఫీతో కలసి ఆమె పనిచేస్తున్న ఆస్పత్రికి వెళ్లి ఆమెపై దాడికి యత్నించాడు. అదే ఆస్పత్రిలో హెడ్‌నర్స్‌గా పనిచేస్తున్న ఫర్హానా స్నేహితురాలు సుమినా అడ్డుకునేందుకు యత్నించగా ఆమెను రాయితో కొట్టాడు. ఆమె తలకు గాయమైంది.